తమ్ముళ్ల బరి తెగింపు

- అడ్డూ అదుపు లేకుండా వ్యవహరిస్తున్న పచ్చ నాయకులు
- అసహ్యించుకుంటున్న ప్రజలు

- పట్టణంలోని కోట వీధిలో వెలసిన ప్రసన్న వెంకటరమణుడి ఆలయ సమీపంలోని ఓ ఇంట్లో పేకాట ఆడుతూ వారం రోజుల ఏడుగురు పోలీసులకు పట్టుబడ్డారు. తీరా వారెవరిని చూస్తే ఇందులో టీడీపీ నాయకులు, వారి సానుభూతి పరులే ఎక్కువ మంది ఉన్నారు.
- నాలుగు రోజుల క్రితం కల్యం గ్రామానికి చెందిన పచ్చ పార్టీ నాయకులు గంగప్ప, లక్ష్మన్న, శేఖర్ కర్ణాటక రాష్ట్రానికి చెందిన 768 టెట్రా పాకెట్లు తరలిస్తూ సెబ్ పోలీసులకు పట్టుబడ్డారు. వీరిపై కేసులు కూడా నమోదు అయ్యాయి.
- గుమ్మఘట్ట మండలంలో ఓ మాజీ ఎంపీటీసీ అక్రమంగా ఇసుసు రవాణా చేస్తూ పోలీసులకు దొరికిపోయాడు. వాహనం సీజ్ చేసి కేసులు నమోదు చేశారు. ఇలా ఆ ముగ్గురే కాదు నియోజకవర్గ వ్యాప్తంగా చాలా మంది యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడుతున్నారు.

రాయదుర్గం: టీడీపీ నాయకులు కొందరు భరితెగిస్తున్నారు. గుడి, బడి అనే తేడాను మరిచి నివాస గృహాలను సైతం జూద కొంపలుగా మార్చేస్తున్నారు. మద్యం, ఇసుక అక్రమ రవాణాలోనూ ఆరితేరిపోతున్నారు. పోలీసులకు పట్టుబడి జైలు వరకు వెళ్లి వస్తున్నా.. మార్పు రావడం లేదు. షరా మాములుగానే వ్యవహరిస్తున్నారు. సులువుగా డబ్బు సంపాదించాలనే దురాలోచనతోనే కొందరు ఇలాంటి అక్రమాలకు పాల్పడుతున్నారనే విమర్శలు సర్వాత్రా వ్యక్తం అవుతున్నాయి. ఇటీవల పోలీసులు జరిపిన దాడుల్లోనూ పట్టణంలోని ప్రసిద్ధి చెందిన ప్రసన్న వెంటకరమణుడి ఆలయం సమీపాన ఓ జూద కొంప వెలుగు చూడటం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఇలాంటివి మరెన్ని ఉంటాయోనన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

మద్యం, ఇసుకలోనూ ఆరి తేరారు..

మద్యం, ఇసుక అక్రమ రవాణాలోనూ కొందరు తమ్ముళ్లు ఆరితేరిపోతున్నారు. వేదావతి హగరినే లక్ష్యంగా చేసుకుని యథేచ్ఛగా ట్రాక్టర్లలో ఇసుకను సరిహద్దులు దాటించేస్తున్నారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన మద్యం టెట్రా పాకెట్లను తీసుకొస్తూ గుట్టుచప్పుడు కాకుండా అమ్మకాలు చేపడుతున్నారు. ఈ క్రమంలో రోజుకు రూ.5 వేల నుంచి రూ.10 వేల దాక ఆదాయం సంపాదిస్తున్నారనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. సంబంధిత పోలీసు అధికారులు నిఘాను మరింత ముమ్మరం చేస్తే ఈ చీకటి వ్యాపారాలన్నీ బహిర్గతమౌతాయని ప్రజలు వాపోతున్నారు.



ఏడుగురు పట్టుబడ్డారు..

వారం రోజుల క్రితం పట్టణంలోని ముసలమ్మ బావి సమీపాన ఓ ఇంట్లో పేకాట ఆడుతూ ఏడుగురు పట్టుబడిన మాట వాస్తవమే. వారందరిపై కేసులు కూడా నమోదు చేశాం. జూదం నిర్వహిస్తున్నట్లు ఎక్కడా మా దృష్టికి రాలేదు. అయినా నిఘాను మరింత ముమ్మరం చేస్తాం. అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతాం. ఒకటికి రెండు సార్లు పట్టుబడ్డ వ్యక్తులపై రౌడీషీట్లు తెరుస్తాం.

– యుగంధర్, సీఐ, రాయదుర్గం

క్లుప్తంగా

అనారోగ్యంతో యువకుడి ఆత్మహత్య



సతీష్‌కుమార్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

కూడేరు: అనారోగ్య సమస్యతో కూడేరుకు చెందిన మంగళ వెంకటేష్ చిన్న కుమారుడు సతీష్ కుమార్ (24) బుధవారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ సత్యనారాయణ వివరాలమేరకు... సతీష్ కూడేరులో బార్బర్ షాపు నిర్వహిస్తుండేవాడు. అయితే ఊపిరితిత్తుల సమస్యతో ఇబ్బంది పడుతూ మనస్థాపం చెంది ఇంటి ముందు ఉన్న రేకుల షెడ్డు కింద చీరతో ఉరి వేసుకున్నాడు. తెల్లారిన తర్వాత కుటుంబ సభ్యులు సతీష్ చీరకు వేలాతూ ఉండడాన్ని గమనించి కిందికి దించారు. అప్పటికే అతడు మృతి చెంది ఉన్నాడు. సతీష్ మృతదేహంపై పడి తల్లిదండ్రులు, సోదరుడు కన్నీరు మున్నీరుగా రోదించడం అందరినీ కంట తడి పెట్టించింది. తండ్రి వెంటేష్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేపు వాహనాల వేలం

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలోని ప్రొహిబిషన్, ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వాహనాలను శుక్రవారం బహిరంగ వేలం వేయనున్నట్లు రూరల్ ఎస్ఐ సుధాకర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఉదయం 11 గంటలకు 9 ద్విచక్ర వాహనాలు, 2 కార్లు వేలం వేస్తామని పేర్కొన్నారు. ఆసక్తి గల వారు రూ.3 వేలు ధరావత్తు చెల్లించి ఆధార్‌కార్డుతో వేలం పాటలో పాల్గొనాలని ఎస్ఐ సూచించారు.

రక్తహీనత నివారిద్దాం



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి

కళ్యాణదుర్గం: గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికల్లో రక్తహీనత నివారిద్దామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి సిబ్బందికి సూచించారు. కళ్యాణదుర్గం ప్రాజెక్ట్ అర్బన్ సెక్టార్ పరిధిలోని వడ్డే కాలనీ, శంకరప్ప తోట, సిద్దప్ప వంక అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో బుధవారం పోషణ పక్వాడా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరోగ్యం పట్ల బాలింతలు, గర్భిణులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా రక్తహీనత, కిడ్నీ వ్యాధులు, గుండె జబ్బుల వంటి వాటిని రూపుమాపేందుకు ప్రభుత్వం అందించే పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. వేసవిలో ప్రతి ఒక్కరూ విధిగా ఎక్కువగా నీరు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సునంద, నాగమణి, శారద, నందిని తదితరులు పాల్గొన్నారు.

నేడు పట్టాభి రామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

కళ్యాణదుర్గం: పట్టణంలోని కోటవీధిలో వెలసిన అతిపురాతనమైనపట్టాభిరామ స్వామి ఆలయంలో శ్రీరామనవమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ బుధవారం పేర్కొంది. ఉదయం 5 గంటల నుంచి పంచామృతాభిషేకం, విశేషాలంకరణ, 10 గంటలకు సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహిస్తామంది. మధ్యాహ్నం 12.30 గంటలకు మహా మంగళ హారతి, తీర్థ ప్రసాద వినియోగం జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి కృపకు పాత్రులు కావాలని కమిటీ పేర్కొంది.

శ్మశానానికి వెళ్లేదారిని మెరుగుపర్చండి



శ్మశానానికి వెళ్లే దారి అధ్వానంగా ఉన్న దృశ్యం

వజ్రకరూరు: మండలంలోని గడేహోతురులో శ్మశానానికి వెళ్లే దారిని మెరుగు పర్చాలని గ్రామస్తులు, అన్నదాతలు కోరుతున్నారు. ఈ రహదారి గుండానే శ్మశాన వాటికతో పాటు పొలాలకు కూడా వెళ్లడం జరుగుతుందన్నారు. రహదారి అధ్వానంగా ఉండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా ఉందన్నారు. మండల స్థాయి అధికారులు వెంటనే స్పందించి రహదారిని మెరుగుపర్చాలని గ్రామస్తులు, రైతులు విజ్ఞప్తి చేశారు.

5 హెల్పర్ పోస్టులకు 10 దరఖాస్తులు

కూడేరు: కూడేరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీ ఉన్న 5 అంగన్‌వాడీ హెల్పర్ పోస్టుల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ బుధవారంతో ముగిసింది. 5 పోస్టులకుగాను 10 దరఖాస్తులు వచ్చినట్లు సీడీపీఓ ధనలక్ష్మీ తెలిపారు. కూడేరు మండలంలోని జయపురంలోని హెల్పర్ పోస్టుకు 4, అనంతపురం రూరల్ మండలంలో పీసీ కాలనీకి ఒక్క దరఖాస్తు రాలేదు. కురుగుంటలోని కేంద్రానికి 2, రాప్తాడు మండలంలో గంగులకుంటకు 2, రాప్తాడులో 2 చొప్పున దరఖాస్తులు వచ్చాయన్నారు.

రూ.9.75 కోట్లతో షాపింగ్ కాంప్లెక్స్

- గడప గడపకూ మన ప్రభుత్వం పనులకు పెద్దపీట
- మున్సిపల్ కౌన్సిల్ మీట్‌లో అధికారులు



అజెండాను వివరిస్తున్న మున్సిపల్ అధికారులు

కళ్యాణదుర్గం: రూ.9.75 కోట్లతో గుడ్‌విల్ పద్ధతిపై నూతన మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణానికి కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపినట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటేశులు తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో బుధవారం కౌన్సిల్ సాధారణ సమావేశం జరిగింది. మున్సిపల్ చైర్మన్ తలారి రాజ్‌కుమార్, వైస్ చైర్మన్ జయం ఫణితో కలిసి కమిషనర్ మాట్లాడారు. ఈ సందర్భంగా నూతన షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం, వారపు సంత, లారీ స్టాండ్, రోడ్డు మార్జిన్ తదితర వాటిపై పన్ను వసూళ్లకు తీర్మానించారు. ముఖ్యంగా గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయా కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు రూ.5 లక్షల లోపు పనులకు ఆమోదం తెలిపారు. త్వరతగతిన పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అదేవిధంగా మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం స్థలంలో చుట్టూ షాపు రూములు నిర్మించుకోవడానికి గుడ్‌విల్ పద్ధతిన టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు అధికారులు తెలియజేశారు.

శ్రీరామనవమి వేడుకలు ప్రారంభం

వజ్రకరూరు: మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో బుధవారం శ్రీరామ నవమి వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. వజ్రకరూరులోని సీతారాముల దేవాలయంలో ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలతో పాటు విశేష పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం కానిగాకు బండి , నిబ్బలం కార్యక్రమాలు చేశారు. అలాగే మండలంలోని పందికుంట, గూళ్యపాళ్యం, రాగులపాడు, ,ధర్మపురి తదితర గ్రామాల్లోనూ వేడుకలు ప్రారంభమయ్యాయి. నేడు కల్యాణోత్సవం, రథోత్సవం కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

బెళుగుప్ప: మండల పరిధిలో వివిధ గ్రామాల్లో ఉన్న రామాలయాలు శ్రీరామ నవమి వేడకలకు ముస్తాబయ్యాయి. ఆయా దేవాలయాల్లో గురువారం సీతారాముల కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. నక్కలపల్లి ,రామసాగరం, తగ్గపర్తి , శీర్పి, దుద్దేకుంట, రామసాగరం, బెళుగుప్ప, ఆవులెన్న, రమనేపల్లి, గుండ్లపల్లి, వెంకటాద్రిపల్లి, జీడిపల్లి తదితర గ్రామాల్లో కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

ముస్తాబైన ఆలయాలు

రాయదుర్గంటౌన్: పట్టణంతో పాటు నియోజకవర్గంలోని రామాలయాల్లో గురువారం శ్రీరామనవమి వేడుకలకు నిర్వహించనున్నారు. సీతారాముల కల్యాణానికి ఆలయ కమిటీ నిర్వాహకులు సర్వం సిద్ధం చేశారు. శ్రీరామనవమి సందర్భంగా పట్టణ సమీపంలోని ఎల్లమ్మ కొండపై పట్టాభి సీతారామస్వామి ఆలయంలో సీతారాముల కల్యాణోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 10:30 గంటలకు కళ్యాణోత్సవం, 12 గంటలకు అన్నసంతర్పణ జరుగుతుందని పట్టాభి సీతారామస్వామి సేవా సంఘం సభ్యులు తెలిపారు.

శ్రీరామనవమి శుభాకాంక్షలు

- ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి





రాయదుర్గం/వజ్రకరూరు: శ్రీరామనవమి సందర్భంగా ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ధర్మాన్ని కాపాడేందుకు జీవితాన్నే త్యాగం చేసిన గొప్ప వ్యక్తి, మహోన్నత ప్రజా పాలకుడు శ్రీరాముడని కొనియాడారు. లోకకల్యాణం కోసం ఎన్నో త్యాగాలకోర్చిన సీతారాముల పవిత్రబంధం భవిష్యత్ తరాలకు ఆదర్శనీయమని కొనియాడారు.

ఆలయ పరిసరాల శుభ్రం

గుమ్మఘట్ట: మండలంలోని 75వీరాపురం తండాలో రామాలయ పరిసరాలను కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు బుధవారం పరిశుభ్రం చేశారు. జాతీయ సేవా పథకంలో భాగంగా నేడు జరగనున్న శ్రీరామనవమిని దృష్టిలో పెట్టుకుని రామాలయం పరిసర ప్రాంతాల్లో వున్న పిచ్చిమొక్కలు, వ్యర్థాలను తొలగించారు. అనంతరం సీజనల్ వ్యాధులపై వివరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు నారాయణ, అధ్యాపకులు రామకృష్ణ, వెంకటేశ్, దేవదాసు తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతు ఆత్మహత్య

కూడేరు: మండల పరిధిలోని కడదరకుంటలో లింగుట్ల రామాంజనేయులు(39) అనే కౌలు రైతు బుధవారం తన పొలంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రం హొస్పేట్ దగ్గర ఉన్న సుగిన హళ్లికి చెందిన రామాంజనేయులు అనంతపురంలో కాపురముంటూ నాలుగేళ్ల క్రితం కడదరకుంటకు చెందిన కురుబ రామాంజనేయులు పొలాన్ని 10 ఏళ్ల కౌలుకు తీసుకున్నాడు. అందులో రూ.లక్షల్లో పెట్టుబడి పెట్టి దానిమ్మ పంటను సాగు చేశాడు. రెండేళ్లుగా తెగుళ్ల సోకడం, వర్షాలతో పంట దెబ్బ తింది. దీంతో పెట్టుబడికి చేసిన అప్పులు అధికమయ్యాయి. దీంతో మనస్థాపం చెందిన రామాంజనేయులు పొలంలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతునికి భార్య దాక్షాయని, ఇద్దరు కుమార్తెలున్నారు. మృతుని భార్య ఫిర్యాదుమేరకు ఎస్ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రేపు 'వైఎస్సార్ ఆసరా' వారోత్సవాలు

శెట్టూరు: మండల కేంద్రంలో శుక్రవారం మూడో విడత వైఎస్సార్ ఆసరా వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఎంపీపీ లక్ష్మీదేవి, ఇంచార్జ్ ఎంపీడీఓ గంగావతి తెలిపారు. రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమశాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. కార్యక్రమంలో భాగంగా మహిళ సంఘాలకు మూడో విడత ఆసరా సొమ్ము చెక్కు అందిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు, స్వయం సహాయక మహిళ సంఘాల సభ్యులు హాజరుకావాలని కోరారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను సస్పెండ్ చేయాలి

రాయదుర్గంటౌన్: పురపాలక సంఘంలోని కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పారిశుద్య కార్మికులను సొంత పనులకు వినియోగించుకుని, కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీంద్రయాదవ్‌ను సస్పెండ్ చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో సీఐటీయూ నాయకులు, మున్సిపల్ కార్మికులతో కలిసి నిరసన ర్యాలీ చేపట్టారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ తన సొంత వ్యాపారమైన చెరకు రసం అంగళ్లలో చెరకు గడలను కట్ చేసేందుకు కాంట్రాక్ట్ కార్మికులను వాడుకుంటున్నట్లు చెప్పారు. చెరకును కట్ చేసే క్రమంలో తిప్పేస్వామి కార్మికుడు తీవ్ర గాయాలపాలైనట్లు చెప్పారు. దీనికి శానిటరీ ఇన్‌స్పెక్టర్ పూర్తి బాధ్యత వహించాలన్నారు. కమిషనర్ దివాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఘటనపై సమగ్ర విచారణ చేపట్టి ఉన్నతాధికారులను నివేదిస్తామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బంగి శివ, స్థానిక మున్సిపల్ యూనియన్ నాయకులు రాము, తిప్పేస్వామి, బసవరాజు, ఆదిలక్ష్మీ పాల్గొన్నారు.

స్వచ్ఛ రాయదుర్గం లక్ష్యం కావాలి

రాయదుర్గంటౌన్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి చెత్త రహిత రాయదుర్గం పట్టణాన్ని తీర్చిదిద్దేందుకు యువత, మహిళలు భాగస్వాములు కావాలని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. స్వచ్ఛ ఆంధ్రమిషన్ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛత కార్యక్రమాలపై పురపాలకసంఘం ఆధ్వర్యంలో జరిగిన అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ.. పట్టణంతోపాటు కాలనీల్లో తమ ఇళ్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు మహిళలు ముఖ్యపాత్ర వహించాలన్నారు. స్వచ్ఛ రాయదుర్గంలో ప్రతి ఒక్కరి కృషి అవసరమని మహిళలతో ప్రతిజ్ఞ చేయించారు. తడి,పొడి, హానికరమైన చెత్తలను వేర్వురుగా మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు అందజేసేందుకు ప్రతి ఇంటికి మూడు రకాల బుట్టలు అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, కమిషనర్ దివాకర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు శ్రీనివాసయాదవ్, వలిబాషా, కౌన్సిలర్లు శ్రీలక్ష్మి, శారదాదేవి, డిష్ గోవిందు, వార్డు ఇన్‌చార్జ్‌లు పొరాళ్ల శివకుమార్, బషీర్ అహ్మద్, గోరంట్ల సత్యనారాయణ, శ్రీరామిరెడ్డి, నిజాముద్దీన్, పద్మ, మెప్మా టీఎంసీ నారాయణరెడ్డి, పట్టణ సమాఖ్య అధ్యక్షురాలు పార్వతి పాల్గొన్నారు.



స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయిస్తున్న విప్ కాపు

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

రాయదుర్గంటౌన్: పేదల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని విప్ కాపు రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. అనారోగ్యంతో ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకుని సీఎంఆర్ఎఫ్ కింద దరఖాస్తు చేసుకున్న వారికి మంజూరైన రూ.2.40 చెక్కులను బుధవారం అందజేశారు. 4వ వార్డులో నివాసం ఉంటున్న సరస్వతికి రూ.1.40 లక్షల చెక్కు, 26వ వార్డుకు చెందిన ముంతాజ్‌బేగం పేరిట రూ.1.40 చెక్కును భర్త జక్రీయాసాబ్‌కు అందజేశారు. వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు శ్రీనివాసయాదవ్, వలిబాషా, పట్టణ కన్వీనర్ ముస్తాక్, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి బీటీపీ గోవిందు, కౌన్సిలర్ ఫకృద్దీన్, వైఎస్సార్‌సీపీ నాయకులు దాదు, అబ్దుల్లా పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం తొలగింపుపై ఇరువర్గాల ఘర్షణ

గుమ్మఘట్ట: గోనబావి గ్రామంలో రోడ్డుకు అడ్డంగా వున్న ద్విచక్ర వాహనం తొలగింపుపై ఇరువర్గాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామంలో వడ్డే సోదరులు సుంకలమ్మ దేవత ఉత్సవాలను మంగళవారం రాత్రి నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని సమీపంలోని వేదావతి హగరిలో జలధికి తీసుకెళ్లి పవిత్ర గంగా జలంతో శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి మేళతాళాలతో గ్రామంలో ఊరేగింపుగా వచ్చారు. అయితే దారి మధ్యలో రోడ్డుకు అడ్డంగా వున్న ద్విచక్ర వాహనాన్ని తొలగించాలని యజమానికి వడ్డే సోదరులు తెలిపారు. అయితే యజమాని ససేమిరా అనడంతో పాటు వాగ్వాదం జరిగింది. ఇరువర్గాలు అసభ్య సదజాలంతో దూషించుకోవడంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. విషయం తెలుసుకున్న పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాలను చెదరగొట్టారు. ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఒక వర్గం 9 మందిపై మరో వర్గం 12 మందిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రామలింగేశ్వరస్వామి ఆలయం ముస్తాబు



శెట్టూరు: శ్రీరామనవమి వేడుకలకు కనుకూరులో ప్రసిద్ధి గాంచిన రామ(సిద్ధ)లింగేశ్వర స్వామి దేవాలయం ముస్తాబైంది. ఏటా శ్రీరామ నవమి రోజున స్వామి రథోత్సవం నిర్వహించటం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఆలయానికి రంగులు వేసి విద్యుద్దీపాలతో అలకరించారు. గురువారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం స్వామి ఉత్సవ విగ్రహాన్ని గ్రామంలో ఊరేగిస్తామని, సాయంత్రం రథోత్సవం ఉంటుందన్నారు.

నేటి నుంచి జంబుకేశ్వరస్వామి ఉత్సవాలు

రాయదుర్గంటౌన్: పట్టణంలో కోటలో వెలసిన స్వయంభూ జంబుకేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం నుంచి ప్రారంభంకానున్నాయి. స్వామి వారి ఉత్సవాలు ఏప్రిల్ 9వ తేదీ వరకూ జరుగుతాయని గ్రూపు దేవాలయాల కార్యనిర్వహణాధికారి నరసింహారెడ్డి తెలిపారు. 30న సాయంత్రం అంకుర్పారణ, కలశస్థాపన, 31న ధ్వజారోహణ, యాగశాల ప్రవేశం, అగ్నిప్రతిష్ఠ, సాయంత్రం సూర్యప్రభ వాహనోత్సవం, ఏప్రిల్ 1న సింహ వాహనోత్సవం, 2న శేష వాహనోత్సవం, 3న కై లాస వాహనోత్సవం, 4న ఉదయం 11.30 గంటలకు కల్యాణోత్సవం, సాయంత్రం ముత్యాల పల్లకీ ఉత్సవం, 5న గజేంద్ర వాహనోత్సవం, 6న ఉదయం 10 గంటలకు మడుగుతేరు, సాయంత్రం 4 గంటలకు శ్రీవారి బ్రహ్మ రథోత్సవం, 7న పార్వేట ఉత్సవం , బాణ సంచా వేడుక, సాయంత్రం అశ్వవాహనోత్సవం, 8న వసంతోత్సవం, మయూర వాహనోత్సవం, 9న సప్త ప్రాకారోత్సవం, శయనోత్సవ కార్యక్రమాలు ఉంటాయన్నారు.

యణ్ణేరంగస్వామి ఉత్సవాలు

కణేకల్లు: మహిమాన్వితుడు, భక్తుల కొంగుబంగారమైన యణ్ణేరంగస్వామి వారి ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఏటా శ్రీరామనవమి పండుగ రోజు నుంచి స్వామి వారి ఉత్సవాలు జరపడం ఆనవాయితీగా వస్తోంది. గురువారం రోజు ఉత్సవం, శుక్రవారం రథోత్సవం జరుగనుంది. గ్రామంలో ఎద్దుల పరుష నిర్వహించనున్నట్లు ప్రజలు తెలిపారు. ఎద్దుల పరుషలో ఎద్దుల క్రయవిక్రయాల కోసం వచ్చే రైతులకు ఉచిత భోజన వసతి, పశువులకు ఉచితంగా పశుగ్రాసం అందజేయనున్నట్లు తెలిపారు.

వ్యవసాయ మోటార్లు భద్రం

కళ్యాణదుర్గం: బ్రహ్మసముద్రం సబ్ స్టేషన్ నుంచి రైతులకు అందించే వ్యవసాయ మోటర్లు కర్ణాటకకు తరలాయనడం అవాస్తవమని విద్యుత్ శాఖ అధికారులు అన్నారు. పలు టీవీ ఛానళ్లు, సామాజిక మాధ్యమాల్లో కథనాలు వైరల్ కావడంతో బుధవారం అధికారులు స్పందించారు. విద్యుత్ శాఖ ఎస్ఈ సురేంద్ర, డీఈ శేషాద్రి శేఖర్ బ్రహ్మసముద్రం సబ్‌స్టేషన్ గోడౌన్‌లో నిల్వ ఉన్న వ్యవసాయ మోటర్లను పరిశీలించారు. వేపులపర్తికి సంబంధించి 115, బ్రహ్మసముద్రంకు సంబంధించి 70 వరకు వ్యవసాయ మోటర్లు గోడౌన్‌లో ఉన్నట్లు గుర్తించామన్నారు. గతంలో ఎన్ని ప్రతిపాదనలు చేశారు..? ఎన్ని రైతులకు అందించారు..? అన్న విషయంలో పూర్తిస్థాయిలో విచారణ చేపట్టామన్నారు. ప్రభుత్వం నుంచి రైతులకు అందే ప్రతి పరికరం నేరుగా రైతుకు అందించడానికి చర్యలు తీసుకుంటామని వారు స్పష్టంచేశారు.

ఆసరా సంబరాలను జయప్రదం చేయండి

వజ్రకరూరు: మండల కేంద్రంలో ఏప్రిల్ 2న వైఎస్సార్ ఆసరా వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి వెంకటరెడ్డి, ఉరవకొండ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సుశీలమ్మ తెలిపారు. ఇందులో భాగంగానే బుధవారం వైఎస్సార్‌సీపీ శ్రేణులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆసరా కార్యక్రమం విజయవంతం చేసేందుకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల సర్పంచుల ఫో రం అధ్యక్షుడు సోమశేఖర్‌రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ రాచన్నగౌడ్, ఉపాధ్యక్షుడు ఉస్మాన్, యువజన విభాగం అధ్యక్షుడు డిష్ సురేష్ తదితరులు పాల్గొన్నారు. మరోవైపు ఆసర సంబరాల నిర్వహణపై స్థానిక స్త్రీశక్తి భవనంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, ఏపీఎం గుణశ్యాం చర్చించారు.

ముగిసిన మార్కెట్ వేలం పాట

రాయదుర్గంటౌన్: పురపాలక సంఘం పరిధిలో దినసరి, వారపు సంత మార్కెట్, జంతువధశాల, సుంకం వసూళ్ల లీజుకు బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, కమిషనర్ దివాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కౌన్సిల్ హాల్‌లో వేలం పాటలు నిర్వహించారు. గత ఏడాదితో పోల్చుకుంటే ప్రస్తుతం జరిగిన వేలంలో అన్ని వేలం పాటల్లోనూ ఆశాజనకంగా ఆదాయం సమకూరింది. జంతువధశాల, దినసరి, సంత మార్కెట్ వేలం పాటలకు దాదాపు 15 మంది పాటదారులు హాజరై సాల్వెన్సీ, డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొన్నారు. తొలుత జరిగిన దినసరి వేలం పాట పోటాపోటీగా సాగింది. చివరకు జి.కృష్ణమూర్తి అనే పాటదారుడు రూ.26.04 లక్షలకు వేలం దక్కించుకున్నారు. గత ఏడాదితో పోల్చుకుంటే మున్సిపాలిటీకి అత్యధికంగా రూ.6 లక్షల ఆదాయం అదనంగా సమకూరింది. అలాగే వారపు సంతను రూ.5.88 లక్షలకు నాయకుల నాగరాజు దక్కించుకున్నారు. జంతువధ శాల సుంకం వసూలును పద్మ రూ.2.57 లక్షలకు దక్కించుకున్నారు. గత ఏడాదితో పోల్చుకుంటే రూ.76 వేల ఆదాయం అధికంగా సమకూరింది. కార్యక్రమంలో ఆర్ఐ మహబూబ్‌బాష పాల్గొన్నారు.

రథోత్సవం ప్రశాంతంగా నిర్వహిద్దాం

కుందుర్పి: వెంకటంపల్లిలో శ్రీరామ నవమి సందర్భంగా రథోత్సవాన్ని ప్రశాంతంగా నిర్వహిద్దామని తహసీల్దార్ విజయకుమారి, ఎస్ఐ కృష్ణమూర్తి పేర్కొన్నారు. బుధవారం గ్రామంలో సీతారాముల రథోత్సవం నిర్వహణపై సమావేశం నిర్వహించారు. రథోత్సవం నిర్వహణకు ప్రజలు సహకరించాలని అధికారులు కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రభాకర్, ఎంపీటీసీ సభ్యుడు అంజినరెడ్డి గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బీజేపీ అసెంబ్లీ కన్వీనర్‌గా శ్రీరామ్ నిరంజన్ గుప్తా

ఉరవకొండ: బీజేపీ ఉరవకొండ నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్‌గా పట్టణానికి చెందిన శ్రీరామ్ నిరంజన్‌గుప్తా నియమితులైయ్యారు. ఈమేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు ఉత్తర్వులను జారీ చేశారు.

ఎన్ఎంఎంఎస్‌కు 13 మంది ఎంపిక

రాయదుర్గంటౌన్: ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్)కు పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 13 మంది ఎంపికయ్యారు. పట్టణంలోని మోడల్ స్కూల్‌కు సుహాన, పూర్ణిమ, రాధిక, వర్షిత, అక్షయ, ముస్తాక్, రంజిత్, అలాగే బీజీ తిలక్ బాలికల మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన విద్యాభార్గవి, అమృత, తనుశ్రీ, కళ్లీమఠం మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన విశాల్, రాధాకృష్ణ మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన లక్ష్మీ, ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన హరేకృష్ణ ఎంపికైనట్లు ఆయా పాఠశాలల హెచ్ఎంలు తెలిపారు.

ఉరవకొండ మండలంలో ఇద్దరు..

ఉరవకొండ: కేంద్ర ప్రభుత్వం అందించే ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఇద్దరు విద్యార్థినులు ఎంపికయ్యారు. మండల పరిధిలోని చిన్నముష్టూరు మోడల్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న పురిపాటి ఉషశ్రీ , ఆమిద్యాల ప్రభుత్వ జెడ్పీ ఉన్నత పాఠశాలలో 8వ తరతి చదువుతున్న జ్యోతిర్మయి ఎంపికైనట్లు హెచ్ఎంలు తెలిపారు.

నేడు సీతారాముల కల్యాణం

రాయదుర్గం: శ్రీరామనవమికి నియోజకవర్గంలోని రాములోరి మందిరాలు, హనుమ దేవాలయాల్లో బుధవారం ఏర్పాట్లు జోరుగా సాగాయి. ఆలయ ప్రాంగణాలను విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. భక్తుల సౌకర్యార్థం కోసం చలువ పందిళ్లు, టెంట్లు ఏర్పాటు చేసేలా కమిటీ సభ్యులు, దేవాదాయ శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. పట్టణంలోని కొండమీద ప్రసిద్ధి చెందిన పట్టాభి సీతారామస్వామి ఆలయం వద్ద 10 వేల మంది భక్తులకు చేపట్టే అన్నదాన కార్యక్రమ ఏర్పాట్లను తహసీల్దార్ మారుతి, వివిధ శాఖల అధికారులు పరిశీలించారు.

బొమ్మనహాళ్: నేమకల్లు ఆంజనేయస్వామి దేవాలయంలో గురువారం ఉదయం 11:53 గంటలకు సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న ఆలయ ఈఓ నరసింహారెడ్డి, ప్రధాన అర్చకుడు అనిల్‌కుమార్ స్వామి ఓ ప్రకటనలో తెలిపారు.

రైతులకు వరం 'వైఎస్సార్ యంత్ర సేవ'

కణేకల్లు: వైఎస్సార్ యంత్ర సేవ పథకం రైతులకు ఓ వరం లాంటిందని కణేకల్లు వ్యవసాయశాఖ అధికారి శ్రవణ్‌కుమార్ పేర్కొన్నారు. మండలంలోని 7 కస్టమ్ హైరింగ్ సెంటర్లకు వైఎస్సార్ యంత్ర సేవా కింద మంజూరైన ట్రాక్టర్లను బుధవారం ఏఓ, ఏడీసీసీ బ్యాంకు మేనేజర్ వన్నూరు స్వామి పంపిణీ చేశారు. ఏఓ మాట్లాడారు. గ్రామాల్లో వ్యవసాయ పనులు చేసుకునేందుకు రైతుల కోసం ప్రభుత్వం 40 శాతం సబ్సిడీతో ట్రాక్టర్లను అందిస్తోందన్నారు.

కొటేషన్ల ఆహ్వానం

వజ్రకరూరు: మండల కేంద్రం వజ్రకరూరులో భక్తుల కొంగు బంగారమైన జనార్దన వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని కొటేషన్లను ఆహ్వానిస్తున్నట్లు ఆలయ ఈఓ అంగదాల కృష్ణయ్య తెలిపారు. బుధవారం వజ్రకరూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏప్రిల్ 6 నుంచి నుంచి 11 వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో విద్యుత్ అలంకరణ, చలువ పందిళ్లు, రథం అలంకరణ, ఆలయానికి కావాల్సిన పూజా, ప్రసాదం, హోమ సామగ్రి తదితర పనులకు కొటేషన్లు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు.

సజావుగా టెండర్ల ప్రక్రియ

ఉరవకొండ: ఉరవకొండ మేజర్ గ్రామ పంచాయతీకి ప్రతిఫలం ఇచ్చే వ్యాపారాలపై 2023–24 సంవత్సరానికిగాను బుధవారం నిర్వహించిన టెండర్ల ప్రక్రియ సజావుగా జరిగింది. దినసరి మార్కెట్‌ను పెన్నయ్య రూ.12,12,111కు దక్కించుకున్నారు. బస్టాండ్‌ను నగేష్ రూ.6,18,500, కసాయి అంగళ్లను బాలాజీ రూ. 6,34,999, మేకలు, గొర్రెల మార్కెట్‌ను మహేష్ రూ.6,62,500కు దక్కించుకున్నారు. ప్లాష్ అవుట్ పాయిఖానాను అశోక్ రూ.5,97,300కు దక్కించుకున్నారు. మొత్తంగా పంచాయతీకి రూ.6,74,310 ఆదాయం పెరిగిందని ఈఓ గౌస్ సాహెబ్ తెలిపారు.